క్లుప్తంగా

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా భద్రత

దుమ్ముగూడెం : త్వరలో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని భద్రాచలం ఏఎస్పీ పరితోజ్ పంకజ్ సూచించారు. గురువారం మండలంలోని రేగుబల్లి, సీతారాంపురం, డి.కొత్తగూడెం, నడికుడి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనునిత్యం మండల వ్యాప్తంగా నిఘా ఏర్పాటు చేసి ఎన్నికలకు ఎలాంటి ఆటంకం కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ దోమల రమేష్, ఎస్సైలు కేశవరావు, గణేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

అశ్వాపురం: మండల పరిధిలోని ఆనందాపురం గ్రామానికి చెందిన ప్రసన్నరావు ఇటీవల గుండె ఆపరేషన్ చేయించుకోగా వైద్య ఖర్చుల నిమిత్తం భారజల కర్మాగారం గౌతమీ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు కే.సోమయ్య, నారాయణరాజు పాల్గొన్నారు.

24 మంది బైండోవర్

అశ్వారావుపేటరూరల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయిస్తున్న వారిపై గురువారం పోలీసులు బైండోవర్ కేసులు నమోదు చేశారు. ఎస్సై పి.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని పలు గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తూ, అక్రమంగా మద్యం విక్రయాలు చేస్తున్న 17 మంది, గడిచిన ఎన్నికల్లో గొడవలకు పాల్పడిన మరో ఏడుగురిపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. కేసులు నమోదు చేసిన 24 మందిని తహసీల్దార్ కృష్ణప్రసాద్ ఎదుట హాజరు పరిచి, వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేసినట్లు ఎస్సై తెలిపారు.

అన్నదానం



దాతను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

మణుగూరు రూరల్ : మండలంలోని సాయినగర్‌లో శ్రీషిర్డీ సాయిబాబా ఆలయంలో సాయినాథుడికి గురువారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అన్నప్రసాద దాత వీరముష్టి గోవర్ధన్–గౌరి దంపతులు, వారి కుటుంబ సభ్యుల సహకారంతో ఆలయ కమిటీ వారు ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. రాజేంద్రకుమార్, మౌనిక, జెన్ని ప్రణీత్, నిహాన్వేద్, ఆలయ కమిటీసభ్యులు దోసపాటి నాగేశ్వరరావు, సీహెచ్ బాల కేశ వరావు, అర్చకులు పవన్ కుమార్ వర్మ, భక్తులు పాల్గొన్నారు.

కరువు మండలంగా ప్రకటించాలి



పంటను పరిశీలిస్తున్న నాయకులు

ములకలపల్లి : ములకలపల్లిని కరువు మండలంగా ప్రకటించాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పలుగ్రామాలను సందర్శించి, వర్షాభావంతో దెబ్బతిన్న పంటచేలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సకాలంలో వర్షాలు రాకపోవడంతో పత్తిపంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు ఊకంటి రవికుమార్, పాడియం వెంకటేశ్వర్లు, మాలోతు రావూజా, హేమాని పాల్గొన్నారు.

గెలుపునకు సైనికుల్లా పనిచేయాలి

అశ్వాపురం: కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి గడపగడపకు తీసుకెళ్లి పినపాకలో బీజేపీ అభ్యర్థి గెలుపునకు పార్టీ శ్రేణులు సైనికుల్లా పని చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్, ఐకార్ సభ్యుడు ముస్కు శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మొండికుంటలో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు తాటిపాముల అయిలయ్య అధ్యక్షతన మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో ప్రతీ ఓటరును కలిసేందుకు ప్రత్యేక ప్రణాళికతో కేంద్ర ప్రభుత్వ పథకాలు క్షేత్ర స్థాయిలో వివరించాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ పున్నం భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి భూక్యా సీతారాంనాయక్, మోరంపల్లి బంజర సర్పంచ్ భూక్యా దివ్యశ్రీ, కార్యదర్శి బత్తుల రామకృష్ణ, నియోజకవర్గ విస్తారక్ కొండి ప్రభాకర్‌రావు, నాయకులు లింగారెడ్డి, రాములు, కృష్ణకుమారి, సుధాకర్‌రెడ్డి, కోలా భాస్కర్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నెర్రెలుబారె..

ఎండుతున్న పంట.. రైతన్న బెంగ

- చేతికొచ్చే దశలో అందని నీరు
- ఇప్పటికే రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టిన అన్నదాత
- దిగుబడి మాటేమో కానీ.. పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేక ఆందోళన



తడి లేక ఎండిపోయిన వరి పంట

దుమ్ముగూడెం : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు కళ్లముందే ఎండిపోతున్న దుస్థితి రైతులను సాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. కళ్లముందే పంటలు ఎండుతున్నా దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. వానలు కురవక కాలువ నీరు రాక అన్నదాతలు ఆందోళనకు లోనవుతున్నారు. మండలంలో ఎక్కువగా వర్షాల మీదే పంటలు ఆధారపడి ఉంటాయి కాగా సెప్టెంబర్ నెల నుంచి వాన జాడ లేక పోవడంతో చేతికందే పంట కళ్ల ముందే ఎండిపోతుంటే మండలంలోని రైతన్న దిగాలుగా చూస్తున్నాడు. పంటలపై ఇప్పటికే లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు ఈ విపత్కర పరిస్థితుల్లో నీటికోసం సతమతమవుతున్నారు. ఆకాశం వైపు నీటి చుక్కల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు. మండలంలో ఈ ఏడాది 22 వేల ఉకరాలలో వరి సాగు చేస్తుండగా మరో 5,500 ఎకరాలలో పత్తి పంటను రైతులు సాగు చేస్తున్నారు. పంటలకు సకాలంలో నీరు అందక పోవడంతో ఈ ఏడాది ఉక్కువ శాతం పంటలు ఎండుతున్నాయి. పత్తి పంట చేతికి వచ్చే సమయంలో నీటి తడి లేకపోవడంతో దిగుబడులపై ప్రభావం చూపే అవకాశముంది. రైతులు జులై, ఆగస్టులో కురిసిన వర్షాలతో చాలావరకు పంటలను కాపాడుకున్నారు. సెప్టెంబరు నుంచి సాగునీటికి కొరత ఏర్పడింది. ఒక్కొక్క రైతు పంటలపై ఎకరాకు వేల రూపాయలు పెట్టుబడి వర్షం కోసం కళ్ల కాయలు కాసేలా ఎదురుచూస్తున్నాడు. పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు భగీరథ ప్రయత్నమే చేస్తున్నారు.

సకాలంలో అందని తాలిపేరు నీరు..

చర్ల మండలంలోని తాలిపేరు ఎడమ ప్రధాన కాలువ ద్వారా మండలంకు సాగు నీరు అందుతుంది.కాగ అధికారులు సకాలంలో కాలువ పూడికతీత పనులు చేపట్టకపోవడంతో తాలిపేరు నీరు అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. ఎండ కాలం చేపట్టాల్సిన కాలువ పూడికతీత పనులు వ్యవసాయ పనులు చివరి దశకు వచ్చాక చేపట్టడంతో సరైన సమయంలో నీరు అందక పంట చేతికందే సమయంలో ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కొన్ని రోజులుగా తాలిపేరు అధికారులు కాలువ పూడికతీత పనులు చేపట్టినప్పటికీ పూర్తి స్థాయిలో చివరి భూములకు నీరు అందకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.



ఎండిపోతున్న పత్తి పంట

రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టా..



వరి, పత్తి పంటలు సాగుచేసేందుకు లక్షల రూపాయలు పెట్టుబడి ఉన్నాం వర్షాలు పడక కాలువ నీరు అందక చేతికందే సమయంలో పంటలు ఎండిపోతుండటంతో దుఃఖం వస్తుంది.పొలం కౌలు తీసుకుని వరి 6ఎకరాలు,పత్తి 20 ఎకరాలు సాగుచేస్తున్నా నీరు అందక పంట ఎండిపోతుంది.

– కందుల పెద్ద వెంకటరెడ్డి, రామకృష్ణాపురం

తీవ్రంగా నష్టపోతున్నాం..



రెండు ఎకరాల వరి పంట,6 ఎకరాల పత్తి పంటను సాగు చేస్తున్నా వర్షాలు పడకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయి దీంతో పంటలకు పెట్టిన పెట్టుబడి సైతం చేతికందే పరిస్థితి లేకుండా పోతుంది కౌలు తీసుకుని వ్యవసాయం సాగుచేస్తున్న వర్షం కోసం ఆకాశం వైపు ఆశగా ఎదురు చూడాల్సి వస్తుంది.

– కొమరం వీరయ్య, నారాయణరావుపేట

మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే..

పినపాక: కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలను ప్రజలు నమ్మే స్థితిలో లేరని, రానున్న ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే ఏర్పడుతుందని ఎమ్మెల్యే రేగా కాంతారావు అన్నారు. మండలంలోని బయ్యారం పంచాయతీలో సీపీఐ, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు గురువారం ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. బీఆర్ఎస్ మండల కార్యాలయంలో వారికి కండువా కప్పి రేగా కాంతారావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని అభివృద్ధి పథకాలు రాష్ట్రంలో అమలవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మడి గాంధీ, మండలాధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి, నాయకులు పోలిశెట్టి సత్తిబాబు, ముక్కు నాసర్ రెడ్డి, వాసు బాబు తదితరులు పాల్గొన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రేగా కాంతారావు

పామాయిల్ క్షేత్రాల సందర్శన



పామాయిల్ మొక్కలను పరిశీలిస్తున్న ఏడీఏ అఫ్జల్ బేగం, అధికారులు

దమ్మపేట: మండల పరిధిలోని దమ్మపేట, మందలపల్లి, నాగుపల్లి గ్రామలలోని లేత దశలో ఉన్న పామాయిల్ క్షేత్రాలను ఏడీఏ అఫ్జల్ బేగం సందర్శించి, తనిఖీలు నిర్వహించారు. ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీలో పామాయిల్ మొక్కలను పొందిన రైతులు, వాటిని క్షేత్రస్థాయిలో సాగు చేస్తున్నారా లేదా అని పరిశీలించారు. తోటలను సందర్శించి, మొక్కలు సాగులో ఉన్నాయా లేదా అని పలుచోట్ల తనిఖీలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి చంద్రశేఖరరెడ్డి, ఏఈఓలు దీప్తి, రవీంద్ర, అనుబాబు, ఫీల్డ్ ఆఫీసర్లు సతీష్, అప్పారావు రైతులు పాల్గొన్నారు.

రక్షణ సూత్రాలు తప్పనిసరి

మణుగూరుటౌన్: పనిప్రదేశాలలో ప్రతీ ఒక్కరు రక్షణసూత్రాలు తప్పనిసరిగా పాటిస్తూ, సంస్థను అభివృద్ధి పథంలో నడిపించాలని ఏరియా జీఎం దుర్గం రామచందర్, లలిత్‌కుమార్‌లు అన్నారు. సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని కొండాపురం భూగర్భగనిలో 54వ రక్షణ వారోత్సవాలు రక్షణ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులు ప్రదర్శించిన కొత్తమలుపు నాటిక అందరినీ ఆకట్టుకోగా కళాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏరియా సేఫ్టీ అధికారి జేవీరమణ, తనిఖీ బృందం సభ్యులు బత్తుల శ్రీనివాస్, ఎం.రామకృష్ణ, కృష్ణప్రసాద్, అమర్నాథ్ రెడ్డి, అబ్దుల్ నబీ, అధికారులు వీసం కృష్ణయ్య, వీరభద్రం, నర్సిరెడ్డి, వెంకటేశ్వర్లు, మధుబాబు, సర్వర్ నబీ, నరేష్, శ్రీనివాస్, పృథ్వీ, సురేష్, నాయకులు వెంకట్, శ్రీనివాస్, నాసర్‌పాషా, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామచందర్

నిరంతరం ప్రజాక్షేత్రంలో పోరాటాలు



మాట్లాడుతున్న రంగారెడ్డి

దమ్మపేట: నిరంతరం ప్రజాక్షేత్రంలో పోరాటాలు చేస్తున్న ప్రజాపంథా అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కెచ్చల రంగారెడ్డి అన్నారు. పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మండలంలోని పట్వారిగూడెం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ గెలుపేనకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులను ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ముద్దా బిక్షం, అమర్లపూడి రాము, నూపా భాస్కర్, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం లోపిస్తే చర్యలు

అన్నపురెడ్డిపల్లి: గ్రామాలలో పారిశుధ్యం లోపిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ అన్నపూర్ణ హెచ్చరించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో మురుగునీరు, చెత్తాచెదారం లేకుండా చూడాలని, ఉపాధి హామీ పనులను గుర్తించాలని సిబ్బందిని ఆదేశించారు. నాటిన హరితహారం మొక్కలను సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ షాబ్నా, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ అన్నపూర్ణ

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



భద్రాచలం పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్ వద్ద ఉన్న ఎస్ఆర్ మెడికల్ షాపునకు ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె లేక పోవడంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, పాదచారులు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలో ఎక్కువ శాతం హోటళ్లు ఈ పరిసరాలలోనే ఉండటంతో నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ దారిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదాలు చోటుచేసుకోక ముందే కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– భద్రాచలం అర్బన్

కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

మణుగూరుటౌన్ : పినపాక నియోజకవర్గంలో సమష్టికృషితో కాంగ్రెస్‌జెండా ఎగురవేద్దామని, కాంగ్రెస్‌ను ప్రజలందరూ ఆశీర్వదించాలని కాంగ్రెస్ పినపాక అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు కోరారు. గురువారం ఆవుల సర్వేశ్వరరావు అధ్యక్షతన కొండాయిగూడెం గ్రామంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో రెండు సార్లు అధికారంలోకి వచ్చినా చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. అన్నివర్గాల ప్రజలకు మేలు జరగాలంటే కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమన్నారు. ఆరు గ్యారంటీలను అందరికీ తెలిసే విధంగా ప్రచారం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు పీరినాకి నవీన్, వైస్ ఎంపీపీ కేవీ రావు, ఏఎంసీ డైరెక్టర్ గుండగాని నాగేశ్వరరావు, ఉపసర్పంచ్‌లు వీరంకి వెంకట్రావుగౌడ్, గోరంట్ల కనకయ్య, నాయకులు తాటి భిక్షం, టీవీ సుబ్బారెడ్డి, ఎంకేఎం రాజు, లతీఫ్, మాదాడి రాజేష్, శ్రీకాంత్, లాలు, దస్తగిరి, యాకూబ్, తమ్మిశెట్టి సాంబ, పాల్వంచ రాములు, సతీష్, ప్రసాద్, రాజేష్, కోడి అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాయం వెంకటేశ్వర్లు

జ్వర సర్వే



మహిళ నుంచి రక్తనమూనా సేకరిస్తున్న వైద్య సిబ్బంది

దమ్మపేట: మండలంలోని పట్వారిగూడం గ్రామంలో గురువారం జ్వర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అనారోగ్యం, జ్వర సంబంధిత లక్షణాలతో బాధపడుతున్న వారి ఇంటి వద్దకే వెళ్లి రక్త పరీక్షలను నిర్వహించారు. దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దివాకర్, హెల్త్ సూపర్వైజర్ బషీరుద్దిన్, విజయ్, హర్షా, ఆశలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థులు

చర్ల రూరల్: రాష్ట్ర స్థాయి అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీలకు మండలంలోని ఏకలవ్య మోడల్ స్కూల్ విద్యార్థులు వర్మ పవన్ సాయి, మద్దెల రాజా మురళి లు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ శకుంతల గురువారం తెలిపారు. త్వరలో కరీంనగర్ లో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థులను ఆర్‌సీఓ డేవిడ్ రాజు, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, పీడీ వెంకటేశ్వర్లు, పీఈటీ అరుణ ఉపాధ్యాయ బృందం, తోటి విద్యార్థులు తదితరులు అభినందించారు.

బల్మూరి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న నాయకులు

ములకలపల్లి: ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ జన్మదిన వేడుకలు గురువారం మండలకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండలాధ్యక్షుడు గుంట్రు సాయి కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎండీ.జహీర్, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు పాలకుర్తి రవి, మేకల రాజేశ్, ఎలకం వెంకట్, దుగ్గి సంపత్, మిరియాల అవినాశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీతతో సత్ప్రవర్తన



విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలు అందజేస్తున్న కృష్ణచైతన్య స్వామి

బూర్గంపాడు: భగవద్గీతతోనే మనిషికి సత్ప్రవర్తన అలవడుతుందని భద్రాచలం శ్రీనృసింహ సేవా వాహిని వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణచైతన్య స్వామి అన్నారు. మండలంలోని వివిధ పాఠశాలల్లోని విద్యార్థులకు గురువారం భగవద్గీత పుస్తకాలను ఆయన అందించారు. ఈ కార్యక్రమంలో పచ్చిపులుసు సుబ్బారావు, లలితకుమారి, సురేష్‌కుమార్, రాఘవేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: విద్యార్థులు చిన్నతనం నుంచే విద్యతో పాటు ఆధ్యాత్మికతను అలవాటు చేసుకోవాలని శ్రీ నృసింహ సేవా వాహిని వ్యవస్థాపకుడు డాక్టర్ కృష్ణ చైతన్య స్వామి అన్నారు. పట్టణంలోని పలు పాఠశాలలో సేవ సమితి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. సుబ్బారావు, లలిత కుమారి, సురేష్‌కుమార్, రాఘవేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

గుట్టుగా గుట్కా విక్రయాలు

- సరిహద్దు రాష్ట్రాల నుంచి తీసుకొస్తున్న వైనం
- దృష్టి సారించని అధికారులు
- అనారోగ్యం పాలవుతున్న యువకులు



చర్ల: మండలంలో నిషేధిత గుట్కాల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మండలంలో విచ్చలవిడిగా సాగుతున్న గుట్కా విక్రయాలపై దృష్టిసారించాల్సిన అధికార యంత్రాంగం ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో గుట్కాకు బానిసవుతున్న జనం అనారోగ్యం పాలయ్యి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఈ విక్రమాలు దర్జాగా సాగుతున్నాయి. సరిహద్దున ఉన్న ఛతీస్‌ఘడ్, ఒరిస్సా రాష్ట్రాల నుంచి వీటిని తీసుకొస్తున్న అక్రమ రవాణాదారులు గ్రామాలు, మండల కేంద్రాల్లోని దుకాణాలకు వీటిని బహిరంగంగానే దిగుమతి చేస్తున్నారు. మండల కేంద్రంలోని గాంధీ సెంటర్, అంబేడ్కర్ సెంటర్, తహసీల్దార్ కార్యాలయం సెంటర్, లక్ష్మీకాలనీ, విజయకాలనీ, పెట్రోల్‌బంక్ సెంటర్‌లతో పాటు గుంపెన్నగూడెం, తేగడ, కలివేరు, సత్యనారాయణపురం, ఆర్ కొత్తగూడెం, కుదునూరు, మామిడిగూడెం, చినమిడిసిలేరు, పెదమిడిసిలేరు, కొయ్యూరు, సుబ్బంపేట, కొత్తపల్లి, లింగాపురం, గొంపల్లి, మొగళ్లపల్లి, తదితర గ్రామాలలో వీటి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సరిహద్దు ప్రాంతాల నుంచి నిత్యం వీటిని విక్రయదారులు కార్లు, టాటా మ్యాజిక్‌లు, ట్రాలీ ఆటోలలో తరలిస్తుండగా మార్గమధ్యలో ఎక్కడా పట్టుబడకుండా నేరుగా మండలానికి చేరుతున్నాయంటే అధికారులు ఏ మేరకు చర్యలు తీసుకుంటున్నారో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. ఎక్కడబడితే అక్కడ గుట్కాలు విక్రయిస్తుండడంతో వాటికి బానిసయిన కొందరు యువకులు నోటి క్యాన్సర్ బారిన పడి తీవ్ర అనారోగ్యం బారిన ఘటనలు కూడా మండలంలో కోకొల్లలుగా ఉన్నాయి. గుట్కా విక్రయాలపై అధికార యంత్రాంగం దృష్టి సారించక పోవడంతో గుట్కా విక్రేతలు వారి అక్రమ వ్యాపారాన్ని మూడు పూలు, ఆరు కాయలుగా కొనసాగిస్తున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. ఇకనైనా గుట్కా విక్రయాల నియంత్రణపై అధికార యంత్రాంగం దృష్టి సారించి అనారోగ్యం పాలవుతూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్న యువతను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

డిగ్రీ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లోని డిగ్రీ చదువుతున్న యువతీ, యువకులకు ఇంపాక్ట్ క్లబ్ ఆఫ్ భద్రాచలం ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు క్లబ్ ఫౌండేషన్ డైరెక్టర్ ఇంటూరి భాస్కరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని వీరభద్ర ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 6న ఒక్క రోజు తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.